## కాకినాడ జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్‌గా ఎన్. రమేష్‌బాబు

**కాకినాడ, పెన్ పవర్, సెప్టెంబర్ 7:** ఎన్టీఆర్ జిల్లాలో గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్. రమేష్‌బాబు పదోన్నతిపై కాకినాడ జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.




# పెన్ పవర్

కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా




వివరాలు 4లో..

## అమరావతిలో టీడీపీ లీడర్‌షిప్ ట్రైనింగ్ కాంక్లేవ్‌లో ఎమ్మెల్యే సత్యప్రభ



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, సెప్టెంబర్, 07:** అమరావతిలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ నాయకుల కోసం రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న లీడర్‌షిప్ ట్రైనింగ్ కాంక్లేవ్ కార్యక్రమంలో ప్రత్తిపాడు శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ పాల్గొన్నారు.

ఇంటరాక్టివ్ విధానంలో నిర్వహిస్తున్న ప్రత్యేక వర్క్‌షాప్‌లో నాయకత్వ నైపుణ్యాల పెంపు, ప్రజలతో మరింత సమర్థవంతమైన అనుసంధానం, పాలనలో ప్రజాప్రతినిధుల పాత్ర తదితర అంశాలపై చర్చలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సహచర శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పాల్గొన్నారు.

## మెగా పోలీస్ నోటిఫికేషన్ కోసం కాకినాడలో భారీ నిరసన




**కాకినాడ, పెన్ పవర్, సెప్టెంబర్ 7:** మెగా పోలీస్ నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేసి పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ పోలీస్ ఉద్యోగ అభ్యర్థులు సోమవారం కాకినాడలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో అభ్యర్థులు శారదమ్మ గుడి సర్కిల్‌కు చేరుకుని ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా "లోకేష్ జాబ్ ఎక్కడ?", "మెగా పోలీస్ నోటిఫికేషన్ విడుదల చేయాలి" అంటూ నినాదాలు చేశారు. పోలీస్ ఉద్యోగాల కోసం చాలాకాలంగా శిక్షణ పొందుతూ, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న తమకు తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. శారదమ్మ గుడి సర్కిల్ వద్ద కొంతసేపు నిరసన తెలిపిన అనంతరం అభ్యర్థులు భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా నిర్వహించారు. పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీలో జాప్యం కారణంగా వేలాది మంది అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారని వారు పేర్కొన్నారు. తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పష్టమైన ప్రకటన చేయాలని, మెగా పోలీస్ నోటిఫికేషన్ విడుదల చేసి నియామక ప్రక్రియను త్వరితగతిన ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలాగే వయోపరిమితి తదితర అంశాల్లో అభ్యర్థులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. అభ్యర్థులు భారీ సంఖ్యలో కలెక్టరేట్‌కు చేరుకోవడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.

## అమలాపురంలో కదం తొక్కిన ఆక్వా రైతులు



- సీడ్, ఫీడ్ ధరలు తగ్గించాలని భారీ ర్యాలీ.. సమస్యలు పరిష్కరించాలంటూ డిమాండ్
- రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన వేలాది మంది రైతులు.. ప్రభుత్వంపై ఆగ్రహం
- అమలాపురంలో ఆక్వా రైతుల భారీ ర్యాలీ



**పెన్ పవర్ ప్రతినిధి (అమలాపురం), సెప్టెంబర్ 07:** అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఆక్వా రైతులు భారీగా కదం తొక్కారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వేలాది మంది ఆక్వా రైతులు తరలివచ్చి తమ సమస్యల పరిష్కారం కోరుతూ ర్యాలీ నిర్వహించారు. 'చలో అమలాపురం' కార్యక్రమంలో భాగంగా పేరూరు వై జంక్షన్ నుంచి అమలాపురంలోని క్షత్రియ కళ్యాణ మండపం వరకు భారీ ర్యాలీగా రైతులు తరలివచ్చారు.

ఆక్వా సాగులో ప్రధానంగా ఎదురవుతున్న సీడ్, ఫీడ్ ధరల భారాన్ని తగ్గించాలని రైతులు డిమాండ్ చేశారు. పెరుగుతున్న పెట్టుబడి వ్యయాలతో ఆక్వా సాగు చేయడం కష్టంగా మారుతోందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు ఉపశమనం కల్పించాలని కోరారు. అనంతరం 'ఆక్వా రైతు బతుకు పోరాటం' పేరుతో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. ఆక్వా రంగంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు ప్రస్తుతం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సీడ్, ఫీడ్ ధరల నియంత్రణతో పాటు ఆక్వా రైతులకు సంబంధించిన ఇతర సమస్యలను కూడా ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.

రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసినప్పటికీ, ఆ కమిటీ చేసిన సూచనలు అమలులోకి రావడం లేదని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పుడు త్వరగా స్పందించేవారని, ప్రస్తుతం వేలాది మంది రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా తగిన స్థాయిలో స్పందన కనిపించడం లేదని వారు విమర్శించారు. ఆక్వా రంగాన్ని నమ్ముకుని జీవిస్తున్న రైతుల పరిస్థితిని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని, సీడ్, ఫీడ్ ధరలను తగ్గించడంతో పాటు రైతుల సమస్యలపై తక్షణ చర్యలు చేపట్టాలని సభలో పాల్గొన్న రైతులు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆక్వా రైతులతో చర్చలు జరిపి, సమస్యలకు పరిష్కారం చూపాలని వారు కోరారు.

## పోలవరం ఎడమ కాలువలో దిగొద్దు.. ప్రాణాలకే ముప్పు

### ఈత, స్నానం చేయవద్దని ప్రజలకు ఇంజినీరింగ్ శాఖ హెచ్చరిక



**తుని/రాజమహేంద్రవరం/కాకినాడ/రంపచోడవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 7:** పోలవరం ఎడమ ప్రధాన కాలువలో స్నానం, ఈత కోసం దిగవద్దని పీఐపీ ఎడమ ప్రధాన కాలువ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ బండారి ఏసుబాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాలువలో నీటి లోతు, ప్రవాహాన్ని అంచనా వేయడం కష్టమని, దిగితే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఫేజ్-1లో భాగంగా ప్రస్తుతం అనకాపల్లి జిల్లా వరకు కాలువలో నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కాలువ మొత్తం ఒకే లోతులో ఉండదని, కొన్ని ప్రాంతాల్లో సుమారు నాలుగు మీటర్ల లోతు ఉండే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా పిల్లలను కాలువ పరిసరాలకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పోలవరం జిల్లా దేవీపట్నం మండలం నేలకోట నుంచి ప్రారంభమయ్యే ఎడమ ప్రధాన కాలువ తూర్పు గోదావరి, కాకినాడ, అనకాపల్లి జిల్లాల మీదుగా సాగి విశాఖపట్నంలోని కణితి బెలన్సింగ్ రిజర్వాయర్‌కు చేరుతుందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి కాలువలోకి దిగకుండా సహకరించాలని పర్యవేక్షక ఇంజినీర్ బండారి ఏసుబాబు విజ్ఞప్తి చేశారు.

## బీజేపీ మండల సంస్థాగత ఎన్నికలపై సమావేశం...

- కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా గొర్ల చంటబ్బాయి..
- యువమోర్చా అధ్యక్షుడిగా వెలుపుల శివనాగ దుర్గ...



**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 07:-** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మండల అధ్యక్షులు ఆద్రా వెంకన్నదొర స్వగృహంలో సోమవారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ రాబోయే సంస్థాగత ఎన్నికలు, మండల స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం తదితర అంశాలపై నాయకులు చర్చించారు.
ఈ సందర్భంగా మండలంలోని పార్టీ అనుబంధ విభాగాలకు నూతన బాధ్యతలను అప్పగించారు. మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా గొర్ల చంటబ్బాయిని, యువమోర్చా అధ్యక్షుడిగా వెలుపుల శివనాగ దుర్గను నియమించినట్లు నాయకులు తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సమావేశంలో సూచించారు.రాబోయే సంస్థాగత ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకోవాలని, గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొమ్మిడి లోవరాజు, సోమ సత్తిబాబు,కర్రి వీరబాబు, బాలిపల్లి చక్రి, సైపిరెడ్డి దొర తదితరులు పాల్గొన్నారు.


## ఆత్రేయపురం మండల ఎమ్మార్పీఎస్, ఎం.ఎస్.పి నూతన కమిటీలు ఎన్నిక





**ఆత్రేయపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 7 :**పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాలతో డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండల ఎమ్మార్పీఎస్, ఎం.ఎస్.పి నూతన మండల కమిటీలను సోమవారంఎన్నుకున్నారు. జిల్లా మాజీ ఉపాధ్యక్షులు కొమ్మర రాఘవ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి డాన్ సూరి మాదిగ, యార్లగడ్డ సత్తిబాబు మాదిగ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా లకారపు చంద్రశేఖర్ మాదిగ (వెలిచేరు), ఎం.ఎస్.పి మండల అధ్యక్షుడిగా లినేకూరి కృష్ణ మాదిగ (కట్టుంగ)లిలను ఎన్నుకున్నారు. వీరితో పాటు నూతన కార్యవర్గాన్ని కూడా ఏర్పాటు చేశారు.
అనంతరం ఎమ్మార్పీఎస్ మండల సీనియర్ నాయకులు పాతకోకల సారధి, కొల్లి వెంకటేశ్వర్లు, కొల్లి కనకంలను ఘనంగా సన్మానించారు.
కార్యక్రమంలో ముప్పిడి పండు, రాచర్ల అరుణ్ కుమార్, యార్లగడ్డ డేవిడ్, యార్లగడ్డ సర్వరాయుడు, యార్లగడ్డ రమేష్, ఉందుర్తి వీర్రాజు, లంక ప్రేమ్ కుమార్, సిరిపెల్ల బాబి, పోసిపోయిన రాజు, దిరిసెన ఆంజనేయులు, కొల్లి విజయ్, చిర్రా సురేష్, కాకిలేటి రమేష్, వేమగిరి శేషు, యార్లగడ్డ కిరణ్, పోసిపోయిన రవి, యార్లగడ్డ సంజీవ్, మెరిపే నాగేశ్వరరావు, కొల్లి వీర్రాజు, కొల్లి కృపావరం, సవరపు యేసు, కొల్లి డేవిడ్, కొల్లి రాజు, కొల్లి మోసే, యార్లగడ్డ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## బాణాసంచా రవాణాపై పోలీసులు దాడి



**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 7:**అంబాజీపేట నుండి అక్రమంగా తరలిస్తున్న బాణాసంచా వాహనంపై అంబాజీపేట పోలీసులు దాడి చేసి సామాగ్రిని సీజ్ చేశారు. ఆదివారం రాత్రి సమాచారం అందడంతో అంబాజీపేట ఎస్ ఐ షేక్ సుభాని సిబ్బందితో వెళ్లి ఆటోలో తరలిస్తున్న 1400 తారాజువ్వలను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు 20వేలు రూపాయలు ఉంటుందని అంచనా. బాణాసంచా యజమాని కడలి వెంకట సూర్యనారాయణ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ ఐ సుభాని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# ఆత్రేయపురంలో మారుతున్న రాజకీయ గాలి..?

# టీడీపీ కంచుకోటలో అసంతృప్తి అలలు!






- రెండేళ్లకే ఎదురుగాలి..? వర్గపోరు, కార్యకర్తల అసంతృప్తితో కొత్త సమీకరణాలపై చర్చ
- 2024లో భారీ మెజార్టీ.. ఇప్పుడు అసంతృప్తి గుసగుసలు!
- కష్టకాలం కేడర్‌కు గుర్తింపు లేదా అన్న ప్రశ్నలు
- కొత్తవారికి ప్రాధాన్యతపై పాత కార్యకర్తల అసహనం?
- టీడీపీ కంచుకోటలో ఎందుకీ అంతర్గత కలకలం?
- వాడపల్లి ఆలయ పాలకమండలి వ్యవహారం రాజకీయ చర్చకు కేంద్రబిందువు
- సామాజిక వర్గాల సమీకరణాల్లో మార్పు సంకేతాలా?
- వర్గాల ఆధిపత్య పోరుతో కేడర్‌లో అయోమయం
- పేరవరం వైసీపీ సభ.. 250 మంది చేరికతో రాజకీయ ప్రకంపనలు
- స్థానిక ఎన్నికల ముందు టీడీపీకి అసలైన పరీక్ష
- చిన్న చీలికలే రేపటి పెద్ద రాజకీయ పగుళ్లా?

**ఆత్రేయపురం, పెన్ పవర్, సెప్టెంబర్ 7 :**
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని ఆత్రేయపురం మండలంలో రాజకీయ సమీకరణాలు క్రమంగా మారుతున్నాయా అనే ప్రశ్న ప్రస్తుతం స్థానిక రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఒకప్పుడు తెలుగుదేశం పార్టీకి తిరుగులేని పట్టున్న మండలంగా పేరొందిన ఆత్రేయపురంలో.. ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలు కొత్త రాజకీయ చర్చకు తెరలేపుతున్నాయి.
2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి భారీ మెజార్టీని అందించిన ఆత్రేయపురం ప్రజల్లోనే రెండేళ్ల పాలన పూర్తయ్యే సరికి అసంతృప్తి స్వరాలు వినిపిస్తున్నాయనే ప్రచారం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ కష్టకాలంలో జెండాను మోసిన పాత కార్యకర్తలకు తగిన గుర్తింపు దక్కడం లేదనే భావన ఒకవైపు.. ఎన్నికల తర్వాత పార్టీలోకి వచ్చిన వారికి అధిక ప్రాధాన్యత లభిస్తోందనే ఆరోపణలు మరోవైపు వినిపిస్తున్నాయి.

### కంచుకోటలో ఎందుకీ కలకలం?

ఆత్రేయపురం మండలం అంటే టీడీపీకి ఒకప్పుడు రాజకీయ కంచుకోట. గ్రామస్థాయి నుంచి మండలస్థాయి వరకు బలమైన కేడర్‌ను కలిగి ఉన్న ప్రాంతంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. అలాంటి మండలంలోనే నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం లోపిస్తోందనే చర్చ జరగడం రాజకీయంగా గమనించాల్సిన పరిణామమే.
పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా పనిచేసిన వారికి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా సరైన ప్రాధాన్యత దక్కడం లేదనే అసంతృప్తి కొందరు కార్యకర్తల్లో వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. "కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన వారికి గుర్తింపు లేకపోతే భవిష్యత్తులో పార్టీ కోసం ఎవరు నిలబడతారు?" అనే ప్రశ్న కూడా అంతర్గతంగా వినిపిస్తున్నట్లు సమాచారం.

### వాడపల్లి పాలకమండలి వ్యవహారం చిచ్చు రేపిందా?



ఆత్రేయపురం మండలంలోని శ్రీ కోనసీమ తిరుమల శ్రీ వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ పాలకమండలి వ్యవహారం కూడా స్థానికంగా రాజకీయ చర్చకు కారణమవుతోంది. వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం విషయంలో కొందరిలో అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు రాజకీయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.
స్థానికంగా రాజకీయంగా బలమైన వర్గాలకు తగిన ప్రాధాన్యత దక్కలేదనే భావన కొందరిలో ఉందని తెలుస్తోంది. దీంతో ఈ అంశం కేవలం ఆలయ పాలకమండలి నియామకాలకే పరిమితం కాకుండా.. సామాజిక, రాజకీయ సమీకరణాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది.

### వర్గపోరుతో కేడర్‌లో అయోమయం

మండలంలో నాయకుల మధ్య వర్గ విభేదాలు, ఆధిపత్య పోరు కొనసాగుతున్నాయనే ప్రచారం కూడా పార్టీ కార్యకర్తల్లో అయోమయానికి కారణమవుతోందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.
ఎవరి వర్గానికి ప్రాధాన్యత? ఎవరికి పదవులు? ఎవరి మాటకు విలువ? అనే ప్రశ్నలు గ్రామస్థాయి రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంటున్నట్లు సమాచారం.
అధికారంలోకి వచ్చిన తర్వాత అందరినీ కలుపుకొని వెళ్లాల్సిన సమయంలో నాయకుల మధ్య విభేదాలు పెరిగితే దాని ప్రభావం నేరుగా కార్యకర్తలపై పడే అవకాశం ఉంటుంది. క్షేత్రస్థాయి కార్యకర్తల అసంతృప్తిని సకాలంలో పరిష్కరించకపోతే అది రాబోయే ఎన్నికల్లో ప్రభావం చూపవచ్చని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

### పేరవరం సభతో రాజకీయ ప్రకంపనలు

ఇటీవల పేరవరం ప్రాంతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుమారు 250 మంది కార్యకర్తలు పార్టీలో చేరినట్లు వైసీపీ వర్గాలు ప్రకటించాయి. ఈ పరిణామం ఆత్రేయపురం రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.
కొంతమంది కార్యకర్తల చేరికతో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయని చెప్పలేమని రాజకీయ వర్గాలు భావిస్తున్నప్పటికీ.. గ్రామస్థాయిలో కార్యకర్తలు, ఓటర్లు ఏ దిశగా కదులుతున్నారన్నది మాత్రం కీలక అంశంగా మారుతోంది.
పేరవరం కార్యక్రమం అనంతరం ఆత్రేయపురం నుంచే టీడీపీకి వ్యతిరేక రాజకీయ గాలి ప్రారంభమైందంటూ వైసీపీ నాయకులు చేసిన వ్యాఖ్యలు కూడా రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

### స్థానిక ఎన్నికల ముందు పరీక్షా సమయం

స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆత్రేయపురంలో ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలు టీడీపీకి కీలక పరీక్షగా మారే అవకాశం ఉందని పరిశీలకులు అంటున్నారు.
ఎన్నికల ముందు పార్టీ అంతర్గత అసంతృప్తిని తగ్గించడం, పాత–కొత్త కార్యకర్తల మధ్య సమన్వయం తీసుకురావడం, వర్గ విభేదాలను పరిష్కరించడం, అన్ని సామాజిక వర్గాలకు సముచిత ప్రాధాన్యత కల్పించడం వంటి అంశాలపై నాయకత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

### అధిష్ఠానం దృష్టి సారిస్తుందా?

ఆత్రేయపురంలో ప్రస్తుతం కనిపిస్తున్న అసంతృప్తి నిజంగా టీడీపీకి వ్యతిరేక రాజకీయ అలగా మారుతుందా? లేక స్థానికంగా ఏర్పడిన చిన్నచిన్న విభేదాలకే పరిమితమవుతుందా? అనేది రాబోయే రోజుల్లో తేలనుంది. అయితే రాజకీయాల్లో చిన్న చీలికలను నిర్లక్ష్యం చేస్తే అవి పెద్ద పగుళ్లుగా మారే అవకాశం ఉంటుందన్నది వాస్తవం. 2024లో భారీ మెజార్టీ అందించిన మండలంలోనే రెండేళ్ల వ్యవధిలో అసంతృప్తి స్వరాలపై చర్చ జరగడం మాత్రం పార్టీ నాయకత్వం గమనించాల్సిన పరిణామమే.
కార్యకర్తలను కలుపుకొని వెళ్లడం, స్థానిక విభేదాలను పరిష్కరించడం, అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా మాత్రమే రాజకీయంగా బలమైన కేడర్‌ను నిలబెట్టుకోవచ్చని రాజకీయ పరిశీలకులు సూచిస్తున్నారు.
ఒకప్పుడు 'టీడీపీ అంటే ఆత్రేయపురం' అనే స్థాయిలో ఉన్న రాజకీయ సమీకరణాలు.. ఇప్పుడు 'ఆత్రేయపురంలో టీడీపీ పరిస్థితి ఏమిటి?' అనే ప్రశ్నకు దారితీస్తున్నాయా అన్నదే ప్రస్తుతం స్థానిక రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారింది.
రాబోయే స్థానిక ఎన్నికలే ఈ ప్రశ్నలకు అసలైన రాజకీయ సమాధానం చెప్పనున్నాయి.

## యల్లమిల్లిలో వైభవంగా వెంకటేశ్వర స్వామివారి రథయాత్ర



**అన్నమయ్య సంకీర్తనలతో మార్మోగిన గ్రామ పురవీధులు.. భక్తుల ఆధ్యాత్మిక సందడి**

**యల్లమిల్లిలో వెంకటేశ్వర స్వామివారి రథయాత్ర**

గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్,07
గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామంలో సనాతన హిందూ ధర్మ ప్రచార ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి కల్యాణ రథయాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పి. నాయకంపల్లి తత్వం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్వర సంకీర్తన గ్రూపు నిర్వహించిన అన్నమయ్య సంకీర్తన కార్యక్రమం అంగరంగ వైభవంగా సాగింది.
ఈ సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి రథం గ్రామ పురవీధుల్లో భక్తుల మధ్య ఊరేగింది. రథయాత్రకు ముందు గ్రామ పురవీధులను పసుపునీటితో శుద్ధి చేశారు. అనంతరం ధర్మ ప్రచార రథం నిర్వాహకులు ప్రతి ఇంటికీ గోవింద నామాల కుంకుమ, అక్షతలు, స్వామివారి చిత్రపటాలను ఉచితంగా అందజేశారు. స్వర సంకీర్తన గ్రూపు సభ్యులు ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సంకీర్తనలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పలువురు భక్తులు రథయాత్రలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కాగా, గత 12 సంవత్సరాలుగా సనాతన హిందూ ధర్మ ప్రచార కార్యక్రమాలను కొనసాగిస్తున్న ట్రస్టు చైర్మన్, రథసారథి శ్రీ కరుటూరి వెంకట శ్రీనివాసరావును గ్రామస్తులు అభినందిస్తూ ఘనంగా సన్మానించారు.
గండేపల్లి మండలంలోని ప్రతి గ్రామంలో ధర్మ ప్రచార రథయాత్రను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు, ట్రస్టు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ది కోనసీమ కోకోనట్ మర్చంట్స్ అసోషియేషన్ అధ్యక్షులుగా పేరి శ్రీనివాస్..



**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 7:**ది కోనసీమ కోకోనట్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా అంబాజీపేటకు చెందిన ప్రముఖ కొబ్బరి (డ్రై కోకోనట్) పేరి శ్రీనివాస్ నియమతుల య్యారు. అంబాజీపేటలో అసోసియేషన్ పూర్వపు అధ్యక్షులు పీకే రావు స్వగృహంలో డ్రై కోకోనట్ వ్యాపారుల సమావేశం శనివారం జరిగింది.
ఈ సమావేశంలో శ్రీనివాస్ ను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడుగా అప్పన శ్యామ్, కార్యదర్శి గోకవరపు శివరామకృష్ణ, సంయుక్త కార్యదర్శి యర్రాప్రగడ సూర్యతేజ, కోశాధికారిగా యర్రాప్రగాడ సూర్యనారాయణ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్కు సంబంధించి రెండేళ్ల పాటు ఈ కార్యవర్గం కొనసాగుతుందన్నారు. నూతనంగా ఎంపికైన కార్యవర్గాన్ని పలువురు వ్యాపారులు అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

